సర్కార్ బడి.. సమస్యల ఒడి

- శిథిలమైన తరగతి గదులు
- ఉపాధ్యాయుల కొరత
- పెచ్చులూడుతున్న భవనం పైకప్పు
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు



పెచ్చులూడి కిందపడిన పైకప్పు శిథిలాలు



పోతుగల్ ప్రాథమిక పాఠశాల

ముస్తాబాద్: మండలంలోని పోతుగల్ ప్రాథమిక పాఠశాలలో సమస్యలు తిష్టవేశాయి. అన్ని వసతులున్నా తరగతి గదులు శిథిలమై విద్యార్థులు, ఉపాధ్యాయులు బిక్కుబిక్కుమంటూ ఉండాల్సిన పరిస్థితి. భవనం పైకప్పు ఎప్పుడు పెచ్చులూడి మీద పడుతాయోననే భయం వెంటాడుతుండగా విద్యార్థులు చదువుకునేందుకు ఇబ్బంది పడుతున్నారు.

61 మంది విద్యార్థులు

పోతుగల్ ప్రాథమిక పాఠశాలలో గతేడాది 30 మంది విద్యార్థులు ఉండగా ఈ విద్యా సంవత్సరం ఉపాధ్యాయులు, గ్రామస్తుల సహకారంతో మరో 31 మంది పాఠశాలలో చేరారు. దీంతో 61 మంది విద్యార్థులు పాఠశాలలో విద్యనభ్యసిస్తున్నారు. అయితే గత జూన్‌లో ఉపాధ్యాయుడు తిరుపతి ఉద్యోగ విరమణ పొందగా ప్రస్తుతం ముగ్గురు ఉపాధ్యాయులు ఐదు తరగతుల్లో బోధిస్తున్నారు. పాఠశాలలో ఐదు తరగతి గదులు ఉన్నా ఒకటి పూర్తిగా శిథిలమైంది. మరో గదిని స్టాఫ్ రూంకు వినియోగిస్తున్నారు. రెండు గదుల్లో రెండేసీ తరగతులు నిర్వహిస్తుండగా, ఒక గదిలో ఐదో తరగతి నిర్వహిస్తున్నారు. ఒకే గదిలో రెండు తరగతుల విద్యార్థులు ఉండడంతో బోధన గందరగోళంగా మారింది. ఐదు గదులు నెర్రెలు బారి పెచ్చులూడుతుండగా ఎప్పుడు మీద పడుతాయోననే విద్యార్థులు భయం భయంగా విద్యనభ్యసిస్తున్నారు.

కోతుల బెడద

పాఠశాల చుట్టూ ప్రహరీ ఉన్నా కోతుల బెడదతో విద్యార్థులు వణికిపోతున్నారు. పలుసార్లు కోతుల దాడుల్లో విద్యార్థులు గాయపడ్డారు. ఉపాధ్యాయులను సైతం వెంబడిస్తున్నాయి. వంట గది శిథిలావస్థకు చేరింది. నీటి సమస్య ఉంది. బోరు బావి నుంచి సంపులోకి, అక్కడి నుంచి ట్యాంక్‌లోకి నీరు ఎక్కించడం ఇబ్బందికరంగా మారింది. మరుగుదొడ్లు, మూత్రశాలలు ఉన్నా అవి సరిపోవడం లేదు. విద్యుత్ సమస్యతోపాటు తాగునీరందించే ఆర్వో ప్లాంట్ రిపేరులో ఉంది. దీంతో విద్యార్థులు ఇంటి నుంచే నీటిని తెచ్చుకుంటున్నారు.

రెండుసార్లు దాడిచేశాయి



కోతులు రెండుసార్లు నాపై దాడిచేశాయి. నీరు తాగేందుకు బయటకు రాగానే ఒక్కసారిగా దాడిచేశాయి. వారంరోజులు ఇంటి వద్దే ఉన్నా. పాఠశాలకు రావాలంటే భయమవుతోంది.

– ధనుష్, విద్యార్థి, రెండో తరగతి

అధికారులకు విన్నవించాం



పోతుగల్ పీఎస్‌లో సమస్యలపై హెచ్‌ఎం అధికారులకు తెలిపారు. కోతుల బెడదతో విద్యార్థులు భయపడుతున్నారు. గదుల కొరత ఉంది. అయిన విద్యార్థులకు సర్దిచెబుతూ పాఠాలు బోధిస్తున్నాం.

– రాజేందర్, ఉపాధ్యాయుడు

క్లుప్తంగా

రేపు యోగాసన పోటీలు



మాట్లాడుతున్న ఎలిగేటి కృష్ణ

సిరిసిల్ల అర్బన్ : జిల్లాలో సీనియర్ యోగాసన విభాగానికి ఎంపిక నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు ఎలిగేటి కృష్ణ తెలిపారు. బుధవారం సిరిసిల్లలో ఆయన మాట్లాడారు. జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 1న పట్టణంలోని సాయికృష్ణ ఫంక్షన్ హాల్ వెంకంపేట్‌లో యోగాసన పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. 18 ఏళ్లనుంచి 55 ఏళ్ల వరకు వివిధ విభాగాల్లో పురుషులు, మహిళలను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారు 7,8 తేదీల్లో ఆదిలాబాద్ జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి యోగాసన చాంపియన్‌షిప్‌కు ఎంపికవుతారన్నారు. ఆసక్తిగల యోగా అభ్యాసకులు స్టడీ సర్టిఫికెట్, ఆధార్ తీసుకురావాలని కోరారు. శ్రీనివాస్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ



సైకిళ్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

తంగళ్లపల్లి: మండలంలోని బద్దెనపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బుధవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి ఆధ్వర్యంలో సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ.. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ జన్మదినం సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే నిరుపేద విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేస్తున్నారన్నారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాగుల రాజిరెడ్డి, మండల విద్యాధికారి రాజు నాయక్, నాయకులు వంశీ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

సిరిసిల్లటౌన్: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి క్రీడాపోటీలు నిర్వహించారు. సిరిసిల్ల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయానికి చెందిన 5 గురు విద్యార్థులు వివిధ విభాగాల్లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఫస్ట్ ప్లేస్ ట్రైత్లాన్ ఈవెంట్ అండర్ 14 విభాగంలో ఏ. చైతన్య (8 తరగతి), బి స్నేహిత(9 తరగతి), ఫస్ట్ ప్లేస్ అండర్ 18 షాట్‌పుట్‌లో వైష్ణవి (ఫస్టియర్), ఫస్ట్ ప్లేస్ అండర్ 18, 400 మీటర్ల పరుగు పందెంలో మనిషా (సెకండియర్), ఫస్ట్ ప్లేస్ అండ్ 20 100 మీటర్స్, 200 మీటర్ల రన్నింగ్ విభాగంలో స్ఫూర్తి (సెకండియర్), రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. వీరిని కళాశాల స్పెషల్ ఆఫీసర్ పావని, పీఈటీ సంధ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

కోనరావుపేట: మండలంలోని నిజామాబాద్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి బొజ్జ చంద్రశేఖర్ తెలిపారు. అండర్–16 షాట్‌పుట్‌లో నందు, అండర్–14 విభాగం ట్రైతలోన్‌లో జైశ్వాల్, కల్యాణి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఆగస్ట్ 3, 4 తేదీల్లో హన్మకొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు షాబొద్దీన్, ఉపాధ్యాయులు అభినందించారు.

కాంగ్రెస్‌ను విమర్శించే అర్హత బీఆర్‌ఎస్‌కు లేదు



మాట్లాడుతున్న బాల్‌రెడ్డి

ముస్తాబాద్: కాంగ్రెస్‌ను విమర్శించే అర్హత బీఆర్‌ఎస్‌కు లేదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం మాట్లాడారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య కాంగ్రెస్ సిరిసిల్ల ఇన్‌చార్జి కేక మహేందర్‌రెడ్డిని విమర్శించడం మానుకోవాలన్నారు. ప్రజల్లో కాంగ్రెస్ వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఏఎంసీ చైర్‌పర్సన్ తలారి రాణి, వైస్‌చైర్మన్ వెల్ముల రాంరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కొండం రాజిరెడ్డి, పట్టణాధ్యక్షుడు గజ్జెల రాజు, గుండెల్లి శ్రీను, తలారి నర్సింలు, ప్రశాంత్, రాజు, బాల్‌రెడ్డి, సత్యం, భాను, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



వీర్నపల్లి: మండలంలోని గర్జనపల్లి గ్రామానికి చెందిన జోగుల మనోహర్ ఇటీవల మృతిచెందగా గ్రామానికి చెందిన యువకులు రూ. 36,342, 25 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఇక్కడ గజ్జెల ప్రశాంత్, అజ్మీరా నవీన్, నగరపు దేవేందర్, చిన్నం దేవేశ్, ఎలగందుల చిరంజీవి, జోగుల నరేశ్, కాంతయ్య మంజుల, అజ్మీరా గణేశ్, వినయ్, తిరుపతి, న్యాతమోహన్, చంద్రయ్య, నవత, తదితరులున్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



అనాథ పిల్లలతో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్లకల్చరల్: తల్లిదండ్రులు లేని పేద పిల్లలకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. వాత్సల్య పథకంలో భాగంగా అనాథ పిల్లలకు స్పాన్సర్‌షిప్ ఇచ్చేందుకు బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రాథమికంగా గుర్తించిన 32 మంది లబ్ధిదారులకు కలెక్టర్ ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పిల్లలతో మాట్లాడి వాళ్ల కష్టనష్టాలను తెలుసుకున్నారు. బాగా చదువుకుని వృద్ధిలోకి రావాలని సూచించారు. స్థలం ఉన్నవారికి ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులు, అవసరమైన వారికి హాస్టల్ సౌకర్యం కల్పించాలని సంక్షేమ అధికారి లక్ష్మీరాజంకు సూచించారు. శిశు సంక్షేమ కమిటీ అధ్యక్షుడు అంజయ్య, సభ్యులు ఖాజా మొహినోద్దీన్, రోజా, డీసీపీవో కవిత, ఎల్‌సీపీవో అంజయ్య, పీవో గగన్, రమేశ్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

వేములవాడరూరల్: సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా సైబర్ సెల్ అధికారి రాజు అన్నారు. వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేట ప్రభుత్వ పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఓటీపీ ఫ్రాడ్, ఏపీకే ఫైల్ ఫ్రాడ్ తదితర అంశాలపై విద్యార్థులకు వివరించారు. సైబర్ మోసానికి గురైతే డయల్ 1930 వెంటనే ఫిర్యాదు చేయాలన్నారు. పోలీస్ సిబ్బంది శ్రీకాంత్, రాజశేఖర్ పాల్గొన్నారు.

అనుమతులు లేని జువెల్లరీ దుకాణంపై ఫిర్యాదు

ముస్తాబాద్: ముస్తాబాద్ పట్టణంలో అనుమతులు లేకుండా స్థానిక స్వర్ణకారుల ఉపాధిని దెబ్బతీసేలా నిర్వహిస్తున్న జువెల్లరీ దుకాణంపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, ఆర్డీవోలకు బుధవారం ఫిర్యాదు చేసినట్లు స్వర్ణకారులు తెలిపారు. స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడు చింతోజు బాలయ్య మాట్లాడుతూ, రెండునెలలుగా ముస్తాబాద్‌లో రాజస్తాన్‌కు చెందిన జువెల్లరీ దుకాణం నిర్వహిస్తున్నారని, దీనిపై స్థానిక స్వర్ణకారులు ఉద్యమాలు చేసినా ఎవరూ చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పుడు ఏకంగా దుకాణం పెట్టి బంగారు, వెండి ఆభరణాలను నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్నారన్నారు. జీఎస్టీ, బ్రోకర్ పాన్ లేవన్నారు. విచారణ చేసి చర్యలు తీసుకొని వంద మంది స్వర్ణకారుల కుటుంబాలను ఆదుకోవాలన్నారు. సంఘం నాయకులు శ్రీనివాస్, బ్రహ్మం, అనిల్, సతీశ్, సత్యనారాయణ, కృష్ణమూర్తి, రాజు, భాస్కర్, హన్మయ్య, వెంకటయ్య, సాయి తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన సత్రానికి రూ. లక్ష విరాళం



వేములవాడ: వేములవాడ రాజన్న నిత్యాన్నదాన సత్రానికి హన్మకొండకు చెందిన పావని– ప్రతాప్ దంపతులు రూ.లక్ష విరాళాన్ని ఏఈవో జి. శ్రవణ్‌కుమార్, డొనేషన్ కౌంటర్ క్లర్క్ రుద్ర సమీరలకు బుధవారం అందజేశారు. దాతలకు స్వామివారి ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించి, ప్రసాదాలు అందించారు. ఈవో రాధాభాయి కృతజ్ఞతలు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

• పల్లె ప్రకృతి వనంలో చెట్లు నరికివేత



ఇల్లంతకుంట: వల్లంపట్ల పల్లె ప్రకృతి వనంలోని నర్సరీ కేంద్రంలో 30 చెట్లను కుక్కల శ్రావణ్ నరికి వేయడంతో ఎస్సై శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేసినట్లు పంచాయతీ కార్యదర్శి తిరుపతి తెలిపారు. గ్రామంలోని పల్లె ప్రకృతి వనం, నర్సరీ తనదేనని శ్రావణ్‌కుమార్ వారం క్రితం దున్ని కందులు సాగు చేశాడని పేర్కొన్నారు. చెట్ల నరికివేతపై రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

• పోస్టర్లు ఆవిష్కరణ

తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లి ప్రభుత్వ ఐటీఐలో ఏర్పాటు చేసిన ఏటీసీ సెంటర్‌లో అడ్మిషన్లు ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ ఎస్.కవిత తెలిపారు. బుధవారం మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎం.విఠల్, ఐటీడీఆర్ ప్రిన్సిపాల్ డి.మురుగస్‌తో కలిసి ఏటీసీ అడ్మిషన్ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఏటీసీ సెంటర్‌లో ఇండస్ట్రీ 4.0 ఆధారిత కోర్సులు అందుబాటులో ఉన్నాయని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

• వ్యక్తి ఆత్మహత్య

వేములవాడఅర్బన్: పట్టణంలోని ముదిరాజ్‌కాలనీకి చెందిన బోడిగే శేఖర్ (60) బుధవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం శేఖర్ ఆర్థిక ఇబ్బందులతో బుధవారం ఉదయం ఇంట్లోంచి వెళ్లి తిప్పాపూర్ శివారులోని పిల్లిగుండ్ల మైసమ్మ ఆలయ సమీపంలో చెట్టుకు ఉరేసుకున్నాడు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

• ద్విచక్రవాహనం చోరీ

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లగొల్లపల్లిలోని మార్కండేయా ఆలయం వద్ద పార్కింగ్ చేసి ఉంచిన ద్విచక్ర వాహనాన్ని దొంగలు అపహరించుకుపోయారు. గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేటకు చెందిన రాచర్ల వేణుకుమార్ బుధవారం రాచర్లగొల్లపల్లికి చేరుకుని మార్కండేయా ఆలయం వద్ద తన బైక్ పార్కింగ్ చేశాడు. పరిచయస్తుల ఇంటికి వెళ్లి వచ్చేసరికి దొంగలు వాహనాన్ని ఎత్తుకెళ్లారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు

ఉచిత వైద్యశిబిరం

ఇల్లంతకుంట: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆర్‌బీఎస్ కే (రాష్ట్రీయ బాల స్వస్థ్య) ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 158 మంది విద్యార్థులకు వైద్యులు పరీక్షలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ దేవరాజం, అధ్యాపకులు నయీముద్దీన్, సతీశ్‌రెడ్డి, మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఎల్లారెడ్డిపేట: మండలంలోని పదిర శివారు చిట్టివాగు నుంచి ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు బుధవారం పట్టుకున్నారు. అనంతరం ఆర్ఐ శ్రావణ్ తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. మానేరువాగు నుంచి ఇసుక తరలింపుకు అధికారులు మధ్యాహ్నం రెండు గంటల వరకు అనుమతులు ఇచ్చారు. ఇసుక ట్రాక్టర్ల యజమానులు మధ్యాహ్నం మూడు గంటల వరకు ఇసుక తరలిస్తుండగా, ట్రాక్టర్లను ఎల్లారెడ్డిపేటలో అధికారులు పట్టుకున్నారు. నిబంధనలు ఉల్లంఘించి ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సుజాత అన్నారు. రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు తెలిపారు.

బద్దెనపల్లి శివారులో..

తంగళ్లపల్లి: మండలంలోని బద్దెనపల్లి శివారులో బుధవారం అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు సీజ్ చేశారు. డ్రైవర్, ఓనర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉపేంద్రచారి తెలిపారు.

టిప్పర్ పట్టివేత

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లబొప్పాపూర్ శివారులో ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్‌ను బుధవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై రాహుల్‌రెడ్డి తెలిపిన వివరాలు.. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం భవానిపేటకు చెందిన డ్రైవర్ కరెయ్య గారి శ్రీనివాస్ టిప్పర్‌లో మట్టిని తరలిస్తుండగా పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. టిప్పర్‌ను సీజ్ చేసి, డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

తల్లిని పట్టించుకోని కొడుకుపై కేసు

తంగళ్లపల్లి: మండలంలోని బస్వాపూర్‌కు చెందిన వృద్ధురాలు బాలసాని ఎల్లవ్వను కొడుకు నారాయణ పట్టించుకోవడం లేదు. తిండిపెట్టకుండా వదిలేయడంతో బుధవారం బాధితురాలు ఫిర్యాదు చేయగా, కొడుకు, కోడలు పద్మపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉపేంద్రచారి తెలిపారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి



లచ్చయ్య (ఫైల్)

బోయినపల్లి: మండలంలోని బూర్గుపల్లి మాజీసర్పంచ్ అతికం లచ్చయ్య (72) అనారోగ్యంతో బుధవారం మృతిచెందాడు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన కరీంనగర్ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పరామర్శించి లచ్చయ్య మృతదేహం వద్ద నివాళి అర్పించారు. మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ అంత్యక్రియల్లో పాల్గొని పాడె మోశారు.

ఎమ్మెల్యే నివాళి

బోయినపల్లి గ్రామ పంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్ కొత్తకొండ మల్లేశం (62) అనారోగ్యంతో మృతిచెందగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నివాళి అర్పించారు. దహన సంస్కారాల నిమిత్తం రూ.5వేలు ఆర్థికసాయంగా అందించారు. అనంతరం కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి ప్రభుత్వం తరపున బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఎంపీడీవో బీమా జయశీల బోయినపల్లి జీపీ ద్వారా రూ.5 వేలు తక్షణసాయం అందించారు. మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సైతం పరామర్శించారు. పంచాయతీ కార్యదర్శి అనిల్, తదితరులున్నారు.



కోనరావుపేట: మండలంలోని కనగర్తిలోని గాంధీవాడలో ఉన్న సింగిల్ ఫేజ్ డీటీఆర్ ఓవర్ లోడ్‌తో తరచూ బ్రేక్‌డౌన్ అవుతుంది. దీంతో కాలనీలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతోంది. ఇక్కడ 25 హెచ్‌పీ అవసరం కాగా అధికారులు 15 హెచ్‌పీ డీటీఆర్ పెట్టడంతో సమస్య తలెత్తుతోంది. అధికారులు స్పందించి 25 హెచ్‌పీ డీటీఆర్‌ను ఏర్పాటు చేయాలి.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
దివ్య : సెస్ ఏఈ సెల్‌నెం 9440814078

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

సన్న వడ్లకు బోనస్ చెల్లించాలి



రాస్తారోకో చేస్తున్న బీజేపీ నాయకులు

ఎల్లారెడ్డిపేట: ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం సన్నవడ్లకు వెంటనే బోనస్ చెల్లించాలని బీజేపీ మండల అధ్యక్షుడు రేపాక రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. రైతులకు బోనస్ చెల్లించాలని డిమాండ్ చేస్తూ.. మండల కేంద్రంలో సిరిసిల్ల– కామారెడ్డి రహదారిపై నాయకులు బుధవారం రాస్తారోకో నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ, రైతులు కొనుగోలు కేంద్రాల్లో సన్నవడ్లు అమ్మి నాలుగు నెలలు గడుస్తున్నా బోనస్ డబ్బులు ఖాతాల్లో జమ చేయడం లేదని ఆరోపించారు. రైతులకు హామీలు ఇచ్చి మోసం చేసిన కాంగ్రెస్‌కు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. నాయకులు పొన్నాల తిరుపతిరెడ్డి, చందుపట్ల లక్ష్మారెడ్డి, నంది నరేశ్, దాసరి గణేశ్, శాగ లక్ష్మణ్, బాలాగౌడ్, దాసరి పూర్ణిమ, కిరణ్‌నాయక్, వంగ బాపురెడ్డి, పర్శరాములు, రంజిత్ కుమార్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



ముస్తాబాద్ : మాట్లాడుతున్న ఎంపీవో వాజిద్

ముస్తాబాద్: దళితులు ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీవో వాజిద్ కోరారు. మండలంలోని మోహినికుంటలో సివిల్స్ రైట్స్‌డేను నిర్వహించారు. ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో దళితుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంటరానితనం సామాజిక రుగ్మత అని, దానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. సమావేశంలో ఆర్ఐ రఘు, ఏఎస్సై అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: గ్రామాల్లో కుల వివక్ష వీడి అందరూ ఐక్యంగా ఉండాలని, జిల్లా విజిలెన్స్ ఎస్సీ, ఎస్టీ కమిటీ సభ్యుడు అజ్మీరా తిరుపతినాయక్, ఏఎస్సై వెంకటరమణ అన్నారు. మండలంలోని అక్కపల్లిలో సివిల్స్ రైట్స్ డే నిర్వహించారు. గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. పంచాయతీ కార్యదర్శి పవిత్ర, ఆర్ఐ సంతోష్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: తాళ్లపల్లిలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, ఏఎస్ఐ ఎండీ ఫస్యుద్దీన్, పంచాయతీ కార్యదర్శి తిరుపతిరెడ్డి, ఎస్సీ ఎస్టీ మానిటర్ కమిటీ మెంబర్ పసుల బాలరాజు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలు, సైబర్ నేరాలపై అవగాహన

కోనరావుపేట: మండలంనిలోని శివంగాలపల్లిలో సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్సై కే. ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ సమాజంలో సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల వినియోగం, వ్యాప్తి ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ఫోన్ చేసి డెబిట్, క్రెడిట్ కార్డు వివరాలు, ఓటీపీ అడిగితే మోసం చేయడమేనన్నారు. గుర్తుతెలియని వెబ్‌సైట్లను, లింకులను ఓపెన్ చేయవద్దని సూచించారు.

ఇల్లంతకుంట: జిల్లా కమ్యూనిటీ ఎడ్యుకేటర్ మంద జనార్దన్ ఇల్లంతకుంట హైస్కూల్ విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగం నియంత్రణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఎం ప్రేమలత, ఉపాధ్యాయులు రమణారెడ్డి, మధుసూదన్ రావు, ప్రదీప్ రెడ్డి, అనిల్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

అడ్డుగా ఉన్న విద్యుత్ తీగలు తొలగిస్తాం

రుద్రంగి: మండలకేంద్రంలో నిర్మించే పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణ స్థలంలో అడ్డుగా ఉన్న విద్యుత్ తీగలను తొలగిస్తామని జిల్లా సెస్ చైర్మన్ చిక్కాల రామారావు అన్నారు. బుధవారం ఎస్సై శ్రీనివాసులు, రుద్రంగి, చందుర్తి సెస్ డైరెక్టర్లు ఆకుల గంగారం, పొన్నాల శ్రీనివాస్‌తో కలిసి మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్ నూతన భవన నిర్మాణం కోసం కేటాయించిన స్థలంలో అడ్డుగా ఉన్న విద్యుత్ తీగలను పరిశీలించారు. ఇక్కడ మాజీ ఎంపీపీ గంగం స్వరూప మహేశ్, రుద్రంగి ఏఎంసీ మాజీ చైర్మన్ దప్పుల అశోక్, తదితరులు ఉన్నారు.

ఇంటి స్థల విషయంలో వివాదం.. సెల్ టవర్ ఎక్కిన వ్యక్తి



ఇల్లంతకుంట: ఇంటి స్థల విషయంలో ఓ వ్యక్తి బుధవారం సెల్ టవర్ ఎక్కి నిరసన తెలిపాడు. ఎస్సై శ్రీనివాసరావు తెలిపిన వివరాలు.పెద్ద లింగాపూర్‌కు చెందిన పందుల కనకయ్య, నర్సయ్య అన్నదమ్ములు. కనకయ్యకు డబుల్ బెడ్ రూం ఇల్లు వచ్చింది. నర్సయ్య తల్లిదండ్రుల పాత ఇంట్లో ఉంటున్నాడు. పాత ఇంటిలో తనకు స్థలం రావాలని కనకయ్య సెల్ టవర్ ఎక్కాడు. గ్రామస్తులు డయల్‌కు 100కు ఫోన్ చేయడంతో బ్లూ కోల్ట్స్ పోలీసులు అక్కడికి చేరుకున్నారు. సమస్యను పరిష్కరించుకోవాలని సర్దిచెప్పడంతో కనకయ్య సెల్ టవర్ దిగాడు.

బాగా చదవండి..



పీసీసీ మెంబర్ వీహెచ్ హనుమంతరావు బుధవారం సిరిసిల్ల గ్రంథాలయాన్ని సందర్శించారు. గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ ఆహ్వాన మేరకు తేనేటి విందు తర్వాత లైబ్రరీలో చదువుతున్న విద్యార్థులను ఆత్మీయంగా పలకరించారు. బాగా చదివి, ఉద్యోగం సాధించాలని వారికి సూచించారు.

– సాక్షి, ఫొటోగ్రాఫర్, రాజన్న సిరిసిల్ల జిల్లా

జీపీ రికార్డులు అప్పగింత

చందుర్తి: మండలంలోని పలు గ్రామపంచాయతీ కార్యాలయాలకు చెందిన 2024–25 ఆర్థిక సంవత్సరం రికార్డులను మండల పరిషత్ కార్యాలయంలో ఆడిట్ అధికారి కరుణాకర్‌కు గ్రామపంచాయతీ కార్యదర్శులు బుధవారం అప్పగించారు. చందుర్తి, మల్యాల గ్రామపంచాయతీ రికార్డుల మినహాయించి, మిగతా గ్రామపంచాయతీ రికార్డులను అప్పగిస్తున్నట్లు వారు తెలిపారు.